కల విపశ్చిద్దృష్టిని కూడా సంపాదించాలి. అప్పుడే పరిణతబుద్ధి అవుతాడు. ఈ పరిణతబుద్ధిమత్తయే సహృదయత.

సాహిత్యమును అనేకముఖాల ఆస్వాదింపవచ్చు. సాహితీ సామగ్రి బహువిధముల ఉంటుంది. కాబట్టి తత్తదాస్వాదము మొదట వివిధముగానే ఉండవచ్చు. అయినా సహృదయుడు ఆవిష్టహృదయుడు. అతని అంతరంగము రస్యమానతాధర్మములను పొదువుకొన్నది. సాహితీతేజఃకణాల కదలికలలోని తళుకుదనములకు అతని హృదయపీఠిక ఆకరము. సుషుప్తిలో మాదిరి నిమ్నోన్నతముల గుర్తింపచేయని సమభావన నిర్విశేషముగా ఆ సహృదయుని అంతరంగములో రసవాహినియై ప్రసరించుతుంది. అతడా సమయములో ఒక హృదయవ్యాప్తినే అనుభవించుడు. సర్వాంగీణానందము అతనికి స్ఫురించుతుంది. సత్యపథమును అతిక్రమింపని తత్త్వము ఆరసయితకు సుసంవేద్యము. అతడు సాత్త్వికసాత్త్వికుడు. విరుద్ధధర్మములందు విశిష్టతేజమును ప్రజ్ఞాచక్షువుతో పరిశీలింపగలడు. అతని స్థితప్రజ్ఞస్వభావత, శాంతచిత్తతను సంపాదించి మహావిమర్శను అవగాహపరుస్తూ అఖండాస్వాదభూమికలో ముంచెత్తుతుంది. అతనికి చర్వణాసమయంలో వైవిధ్యమును సంపాదించిన విశేషములు భాసింపవు. సహృదయునికి భావన ప్రధానము. ఆభావన దీర్ఘదీర్ఘము. అది అనాదినిధనము. ప్రాక్తనసంస్కారానుగతము. ధారావాహికము. రసమాత్రానుస్యూతము. భావకుని హృదయం రసమయము.

ఇటువంటి రసయితను కవి సంపాదించాలి. కావ్యము ఈరసికుని వరించాలి. అప్పుడు కాని కవి కావ్యమ్ముల ప్రతిభాపారము రాణకెక్కదు. నేటికాలమున తగిన కవులు లేరనుటకు నాకు సాహసము లేదు. ఆంధ్రభూమి సహృదయులు లేక గొడ్డుపోలేదు. నవ్యకావ్యముల సౌందర్యమును విషమరీతితో ఆస్వాదింప మొదలుపెట్టుట నవకవుల నీరోగచక్షువులోని కల్కము. పురోభాగిత్వమును పూనుకొనుటకు వెనుదీయుని పెద్దలను ఏమీ అనలేము కాని సౌందర్యముద్రను ప్రదర్శింపచేయుటకు నవలావణ్యమును ఆస్వాదింపచేయుటకు తమ విపశ్చిద్దృష్టిని ఏల ప్రసరింపచేయరాదు? దోషముల వెదకుట సులభమని అనను. వానిని సహించుట క్షమించుట తగునని పలకను. అరసికరచనలను ఆదరింపవలయునని కోరుకొనను. కాని తమతమ సహృదయత్వ పరీక్షకైనను సౌందర్యసమీక్ష చేయరాదా? ప్రాచీన కావ్యములు కేవలము దోషవిధురము లని కాని నవకవుల కృతులు కేవలము మధురాతిమధురము లని కాని అనలేదు. ప్రాచ్యనవీనభేదములను భావయిత మనసులో ఉంచుకొనరాదని అనగలను. విమర్శకులనూయాగ్రస్తులు అనే అపఖ్యాతి మాసిపోవలయును. అంతరంగవిమర్శ చేయలేనివాని విమర్శ విమర్శ కాదు.

సాహిత్యాస్వాదము సామాన్యకృత్యము కాదు. ప్రతిమనుష్యుడు ధర్మానుష్ఠాత కాలేనట్లు ప్రతిమానవుడూ సాహిత్యాస్వాదము చేయలేడు. కావ్యకర్తృత్వభోక్తృత్వముల కలయికను సమరసముగా సమన్వయించుకొనగలిగిన తత్త్వశీలి అయితేనే అందుకు సమర్థుడు. సాహితీమాధుర్యం తెలుసుకోవటానికి శాస్త్రాల కారానికి అలవాటుపడిన కటుకునాలిక ఉపయోగింపదు. కావ్యసామాన్యంలో అంతటా అఖండంగా అనుస్యూత మవుతూ ఉన్న ఆత్మశక్తి అహమహమికతో కూడుకొన్నప్పుడే ఆస్వాదపథములో ఆనందకళ అమృతవాహిని.

అపచారం

కొడవటిగంటి కుటుంబరావు

జీవితాన్ని గురించి నలుగురూ ఏమనుకుంటున్నారో నాకు తెలుసుకోవాలని ఉండదు. నాఅభిప్రాయాలు మరొకరికి చెప్పను కూడాను. కాని కనీసం నెలకొక పర్యాయం తెలివిగల ఆడదానితో ఒక గంటసేపు మాట్లాడితే కాని నాకు తృప్తిగా ఉండదు. అనుభవజ్ఞురాలైన ఆడది తనకు తెలియకుండానే జీవితం మీద మంచి వ్యాఖ్యానం చెయ్యగలదని నేను అనుభవంమీద తెలుసుకున్నాను. మగవాడు ఆడదానికంటె దూరం ఆలోచించినా తన తెలివితేటలను కాస్సేపు దాచిపెట్టి మాట్లాడలేడు....

నాకు చప్పున అందుబాటులో ఉండేదీ, కొంతవరకైనా నాకు కావలసిన విధంగా మాట్లాడేదీ సుబ్బులు. నేను సామాన్యంగా వేశ్యలను ఆమోదించను. వాళ్ళలో చాలామందికి అసాంతం నటించటం చాతకాదు. నటించటం చాతకాని వేశ్యా, చాతనయిన ఇల్లాలూ నాకు పనికిరారు. సుబ్బులుతో ఆభయం లేదు. అది నన్ను చూడగానే సంతోషం కనపరిచిం దంటే నేను దాని ఇంటో కూర్చున్నంతసేపూ సంతోషంగా ఉండటానికి తయారన్నమాటే. "ఒక పదిరూపాయ లుంటే బదులిచ్చి దబ్బున ఇంటిదారి పట్టు!" అని విసుగుతో అనగల దమ్ము నేనెరిగినంతవరకు సుబ్బులుకే ఉంది. (సుబ్బులు నాదగ్గిర డబ్బు బదులుగా తప్ప పుచ్చుకో దని నేను వేరే చెప్పనక్కర్లేదు. కాని తీసుకున్న డబ్బు మళ్ళీ తిరిగి మాత్రం ఇవ్వదు — ఇచ్చేటందుకు దానిదగ్గర ఉండదు!)...

ఆనాడు రాత్రి పెందలాడే భోంచేసి సానిసందుకు బయలుదేరాను. ఆసందులో అడుగుపెట్టగానే నాకు "ఇందులోనించి ఎవరో పాతవాళ్ళు వెళ్ళారు. కొత్తవాళ్ళు వచ్చారు" అనిపించింది. నాకట్లా తెలుస్తుంది. మావీధిలో మాయింటి పక్కవాళ్ళు ఇల్లు ఖాళీచేసి వెళ్ళిపోయినా నేను కనుక్కోలేను కాని సానివీధిలో

ఏవిధమైన మార్పు జరిగినా నాకు తెలిసిపోతుంది. దివ్యదృష్టో ఏదో అయి ఉంటుంది.

కాని దెబ్బ నాకే తగిలిం దని నేను ఏమాత్రమూ ఊహించ లేదు. సుబ్బులు ఇంటిని గుర్తుపట్టలేకపోయాను. ముందు వసారా లో ఒక కిరసనాయిలు బుడ్డి పెట్టి ఉంది; ఒక నులకమంచంమీద ఒక పాలిపోయిన గర్భిణీ స్త్రీ కూర్చుని ఆయాసంతో రొప్పుతూ దగ్గుతున్నది. లంజరికం చేసి సంపాదించిన రూపాయలను గవ్వల కింద ఖర్చుపెట్టే వేశ్యలు అప్పుడప్పుడూ చూస్తూ ఉండడం మంచి దేమో కాని, నేను మాత్రం ఆదృశ్యాన్ని భరించలేకపోయినాను. అక్కడినించి కదిలాను.

సుబ్బులు వెళ్ళిపోయింది. అది పోతాను పోతా నని అంటూనే ఉండింది, కాని నేను నమ్మలేను. రెండేళ్ళనుండీ అదే కూత కూస్తున్న మనిషి ఆకూత సార్థకంచేస్తుం దని ఎట్లా అనుకోవడం?

తిరిగి వస్తూ కొత్తమనిషిని చూశాను. మెట్లమీద కాళ్ళు పెట్టి అరుగుమీద కూచుంది, వీధికి పక్కమొహంగా. లోపలినించి దీపం వెలుతురు ఆమె కుడిచెంపమీదా కొద్దిగా వక్షస్థలంమీదా పడుతున్నది. ఆమెవీపు నావైపుగా ఉంది. నాఅడుగుల చప్పుడుకు వెనక్కి తిరిగింది. నేను ఆగటంచూసి లేచి నిలబడ్డది.

"ఎంత మంచి జుట్టూ! లేక సవరమా?" అన్నాను ఉపోద్ఘాతంగా.

ఆమనిషి వినిపించుకోలేదో లేక నామాటలు అర్థం చేసుకో లేదో కాని నాకేమీ సమాధానం చెప్పలేదు.

"అమావాస్య వెన్నెలలో నీమొహం ఎరిగిన మొహమల్లే ఉంది. నేను నిన్నెప్పుడైనా చూసిఉంటా నంటావా?"

ఆమనిషి నవ్వి "లేదుకాని దయచెయ్యండి!" అంది.

"ఆపది దయచెయ్య మంటే నేను లోపలి కనే అర్థంచేసు కుంటాను," అంటూ సమీపించాను.

"నేను కాదన్నానా! రండి!"

"రండీ అంటే కులట!"

"అయితే అయింది, రండి!"

"నేను ఓడాను," అంటూ ఆమెవెంట లోపలికి వెళ్ళాను.

దీపం వెలుతురున ఆమె మొహం చూడగానే నిర్ఘాంత పోయినాను. అంత అందమయిన మనిషి! మొహంలో అంత నాగరికతా, కుదిరికా, నేర్పరితనమూ, కళా నేనెన్నడూ చూచినట్టు జ్ఞాపకం లేదు. ఆపదానిలో సౌందర్యానికి ఎక్కువ విలవ ఇవ్వటం మానేసిన తరవాతనే నిజమైన సౌందర్యం నన్ను అమితంగా కలతపెట్టసాగిం దని ఒప్పుకుంటాను.

"ఎంత అందంగా ఉన్నావూ!" అన్నాను. హృదయ పూర్వకంగా. ఆమె నవ్వి "మీవంటివాళ్ళే ఆడవాళ్ళను పాడు చేసేది కాదు" అన్నది.

"నేను నిన్ను పాడుచెయ్యబోవటం లేదు. వెళ్ళిపోతాను అన్నాను."

"ఏం"

"నాకు చక్కని వేశ్యను చూస్తే ఏమాత్రమూ భయం"

"ఏం విడ్డూరంగా మాట్లాడతారండీ! ... నిలబడే ఉన్నారు. కూర్చోండి!"

కూర్చున్నాను. తను వచ్చి నాపక్కనే మరొక కుర్చీలో కూర్చుని నావంక పరీక్షగా చూడసాగింది.

"ఆలోచించిన కొద్దీ నీసంగతి విచిత్రంగా ఉంది. నువ్వెవరు? ఒంటరిగా ఎందు కుంటున్నావు? గద్దతన్నుకుపోయినట్టు నిన్ను ఎవరో ఒకరు ఎందుకు తన్నుకుపోలేదు?" అని అడిగాను.

ఆమె మళ్ళీ నవ్వింది,

"గద్దలసంగతి నాకు తెలియదు కాని ఇవాళ ఉదయం నేనిక్కడ దిగినప్పటినుంచీ మాలకాకులు చాలా తారట్లాడుతున్నై. ఒకటి రెండు ధైర్యంచేసి లోపలికి కూడా జొరబడి 'కా కా' మని అరిచినై. చీపురుకట్ట చూపించాను.

నేను ఒంటరిగా ఉండటం లేదు. మాతమ్ముడున్నాడు. సినిమాకు వెళ్ళాడు."

"మాలకాకు లంటున్నావు కాని అవి నిన్ను వదిలిపెట్ట వేమో ననుకుంటాను. చివరకు నువ్వు వాటి పాలపడక తప్ప దేమో."

"అని మీకు దిగులుగా ఉందా!" అన్నది మళ్ళీ నవ్వుతూ.

"దిగులంటే, దిగులే మరి! తను తప్ప మిగిలినవాళ్ళంతా మాలకాకులే ననుకోని మగవాణ్ణి నువ్వెక్కడన్నా చూశావా? చక్కని ఆపది సంబంధించినచోట!"

"నాకు మగవాళ్ళను గురించి మీరనుకున్నంత తెలీదేమో!" అన్నదామె.

ఆమాటతో నాఅనుమానం కొంత రూఢి అయింది.

"నేనెంత గుడ్డివాణ్ణయిపోయాను! నువ్వు భోగందానివి కావు. నువ్వెవరవు?"

ఆమె ఇంకా నవ్వుతోనే "నేను భోగందాన్ని కానని ఎట్లా తెలిసిందీ?" అన్నది.

"నీఅవతారం! నీమాటలధోరణి! నీ ఉచ్చారణ! నన్నిక బుకాయించకు."

"భోగం దంటే ఎవరు?"

"నేను చెప్పలేను కాని నువ్వుమాత్రం భోగందానివి కావు."

"నేను శరీరం విక్రయించుకోవటానికి సిద్ధంగా ఉన్నాను. భోగందాన్నేనా!"

"కావు. నువ్వీవృత్తిలో స్థిరపడలేవు. ఏదో గీత,, చాలక ఇట్లాదిగావు కాని."

"ఎందుచేతో!"

"నువ్వు అమాయకురాలివి."

"అంటే తెలివితక్కువదాన్ననా?"

"కాదు. మాయలు తెలియనిదానివి. నువు మనుష్యులను మోసం చెయ్యలేవు. నామాట విని విరమించుకో! ఎవరినన్నా డబ్బున్నవాణ్ణి బుద్ధిమంతుణ్ణి చూసుకో?"

"నేను మోసంచేశాను?" అన్నదామె గర్వంగా.

"ఎవర్ని?"

"ఎవరినైతే నేం? ఆయనకు కృతజ్ఞత చూపలేకపోయినాను. ఆయన డబ్బు వృథాగా ఖర్చుచేశాను. ఆయన కోపాన్ని లక్ష్యం చెయ్యలేదు. ఆయన నన్ను భరించలేక వదిలిపెట్టేశాడు. నేను ఒక చెంప వైధవ్యంతోనూ మరొకచెంప సవితతల్లిపోరుతోనూ నరకం అనుభవిస్తుంటే నన్ను ఉద్ధరించిన మనిషి!"

"చేసిందానికి పశ్చాత్తాపపడుతున్నావుగా!"

"లేదు. పశ్చాత్తాపడితే మీతో ఇదంతా చెబుదునా?"

నాకా మనిషి పోకడ అర్థం కాలేదు.

"ఇప్పుడేమయిందీ? పోయినవాడు జారిపోయినాడు. అటువంటివాడు మరొకడు దొరకడూ?"

"దేనికి చెప్పండి! ఒకమనిషిని తృప్తిపరచటం కంటె వెయ్యిమందిని తృప్తిపరచటం ఆడదానికి సులభం కాదూ? ఒక్కడికోసమని స్వేచ్ఛ ఎందుకు పోగొట్టుకోవాలి? దీనిని బట్టి చూస్తే ఏదైనా ఒకటే కదా!"

"పిచ్చిదానా, వెయ్యిమందిని ప్రేమించటం కంటే ఒక్కణ్ణి ప్రేమించటం తేలికకాదూ? ప్రేమించటంకంటె మనిషికి అందమైన అనుభవం ఏముంటుంది?"

ఆమాట ఎందుకన్నానో ఇప్పుడు నేను ఊహించుకోలేను. ఆమనిషిని చూస్తుంటే నాకు మతిపోయి ఉంటుంది. ప్రేమ ఎరగని నాజీవితానికి నేను ఆక్షణంలో నాకు తెలియకుండానే పశ్చాత్తాపపడి ఉంటాను. అటువంటి స్త్రీని ప్రేమించగలిగితే ఎంతబాగుంటుంది అనిపించి ఉంటుంది నాకు.

ఆమనిషి నావంక ఆశ్చర్యంతో చూసి "ప్రేమించటం అందమైన అనుభవం అని ఎవరు చెప్పారు మీకు?" అన్నది. ఆమె గొంతులో కాఠిన్యం చూసి నేను నిర్ఘాంతపోయినాను.

"ఏమో నేనట్లా అనుకున్నాను," అన్నాను తప్పుచేసినవాడల్లే.

"మిమ్మల్ని ఏస్త్రీ అయినా ప్రేమిస్తే ఆమనిషిని వెంటనే వదిలించుకోండి! ఆమె మీకెందుకూ పనికిరాదు. ప్రేమించిన ఆడదానికి వళ్ళు తెలియదు. తను ఎంత అధమస్థపు మనిషి అయినా సరే తనకంటె ప్రపంచంలో మొనగాళ్ళెవరూ లేరన్నంతగా గర్విస్తుంది. మతిలేకుండా ప్రవర్తిస్తుంది. ప్రేమించినవాడికి ప్రేమ తప్ప గౌరవమూ కృతజ్ఞతా ఇవేవీ చూపించలేదు. అతన్ని సంతోషపెట్టటానికి సమస్తమూ త్యాగం చేస్తుంది. అందులో అతని డబ్బు కూడా ఉంటుందనే జ్ఞానమైనా ఉండదు. తీరా సర్వనాశం అయేదాకా ఆమనిషికి కళ్ళు తెరుపుడు పడవు!..."

నాలోనించి చెప్ప శక్యంగాని ఆవేదన పుట్టుకొచ్చింది. ఆమె ప్రతిఒకమాటా ఒక బల్లెం అయి ఉంటే నన్నంతకన్న ఎక్కువబాధపెట్టి ఉండేదు. నాహృదయం వలవలా ఏడిచింది. నాకళ్ళవెంట నీళ్ళు రాలేదని కూడా చెప్పలేను. నేనక్కడ ఒక్కక్షణం కూడా నిలవలేక బయటికి వచ్చేశాను...

మళ్ళీ నేనా మనిషిని చూడలేదు. ఆమె సంగతి ఏమయిందో నాకు తెలియదు. కాని ఆమె జ్ఞాపకం వచ్చినప్పుడల్లా "ఎంత నిర్భాగ్యురాలు! ఎటువంటి దేవత!" అనుకుంటాను.

గ్రామోఫోను రికార్డులు

శ్రీమతి కృష్ణకుమారి

ఏదైనా ఒకటి పుట్టిందంటే సామాన్యంగా ఏదో మంచికే పుటుతుంది. అది క్రమంగా పెరిగి కొద్ది కాలానికి చెడ్డదిగా మారిపోవచ్చును. ఒకొప్పుడు అలాగా మారకపోనూ వచ్చును. ప్రపంచంలో పుట్టిపెరుగుతూండే ప్రతివానికీ వాని భావిజీవితానికి పుట్టుకలోనే అంకెలు గుణించడం హాస్యాస్పదం. అది కాలాధీనం. ప్రజాపతి ఎవ్వరిని కానీ ఆదిలోనే ప్రజలను మీరు దుర్మార్గులు కండి అని నొసటను వ్రాయడు కాని కొందఱు తమతమ స్వభావదౌర్బల్యాన్ని బట్టి తమ వాతావరణాన్ని బట్టి చెడ్డవుతారు. వినంతమాత్రాన సృష్టే మంచిదికాదని తిట్టకూడదు. కాని మానవసంఘంలో ప్రవేశించే చెడుగును చేతనైనంత వఱకు దూరం చేస్తూండాలి.

గ్రామఫోనులూ, గ్రామఫోను రికార్డులూ, మొట్టమొదట్లో మంచి ఉద్దేశంతోనే ఆరంభింపబడ్డాయి. కాని చిట్టచివరకు పాడైపోయాయి. వినంతమాత్రాన గ్రామఫోను ఉద్యమాన్నే దూషించడం నాఉద్దేశం కాదు. గ్రామఫోనులంటే సామాన్యమా? ఇప్పుడంటే రేడియోలమీద గ్రామఫోనులు కొంచెం వాసి తగ్గినాయి కాని, గ్రామఫోనులు ఒక విషయంలో రేడియోలకంటె కూడా గొప్పవి. రేడియోలో పాడుతూంటేనే వినబడుతుంది. గ్రామఫోనులో రికార్డయితే చచ్చిపోయినా శాశ్వతంగా వాళ్ళకంఠం నిలిచిపోయి వాళ్ళపేరును శాశ్వతం చేస్తుంది. "అయ్యో! త్యాగరాజుగారి రోజుల్లో గ్రామఫోనైనా ఉన్నది కాదే." అని విచా